క్లుప్తంగా

శాంతివర్ధనలో తనిఖీలు



శాంతివర్ధనలో సేవలపై ఆరా తీస్తున్న ఎంఎల్ఎస్ కమిటీ బృందం

పెద్దాపురం: పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ బృందం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సేవలపై ప్యానల్ లాయర్ అత్తిలి ప్రభూజీ, పారా లీగల్ వలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, వీఎస్ఎన్ మూర్తి, కుంచే నానిబాబు, లక్ష్మీ బృందం ఆరా తీసింది. శాంతివర్ధన సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం దివిలి ఎస్సీ, బీసీ హాస్టల్స్‌ను తనిఖీ చేసి అక్కడ అధికారులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు లక్ష్మి, భాస్కరరావు తదితరులున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సామర్లకోట: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. శనివారం సాయంత్రం వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ మండల పరిధిలోని ఉపాధ్యాయులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆరో తరగతి నుంచి విద్యార్థులను గమనించాలని సూచించారు. ఏయే సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అదే విధంగా విద్యార్థుల హ్యాండ్ రైటింగ్‌పై కూడా శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెచ్ఎం పి.అనురాధ అధ్యక్షత వహించారు.

ముగిసిన లేఖర్ల సమ్మె

సామర్లకోట: రెండు రోజుల పాటు నిర్వహించిన దస్తావేజు లేఖర్ల సమ్మె శనివారంతో ముగిసింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్ర, శని వారాలు పెన్‌డౌన్ సమ్మె నిర్వహించారు. నూతన సాంకేతిక విధానం పేరుతో ఓటీపీ చెప్పాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు లేఖర్లు సమ్మె చేశారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరిగి పోవడంతో సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలను చెప్ప వద్దని అధికారులు సూచనలు ఇస్తున్న తరుణంలో రిజిస్ట్రేషన్ జరిగిన సమయంలో అమ్మకందారునికి చెందిన కుటుంబ సభ్యులందరూ ఓటీపీ చెప్పాలనే నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ఆస్తులు విక్రయాలు చేసే వారి అభ్యంతరాలు కారణంగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి సమ్మె చేసినట్టు స్థానిక లేఖర్ల సంఘ నాయకులు సీతాపతిరావు, పేకేటి చినపుత్రయ్య, ఎస్.వెంకట్ తెలిపారు. ఉపాధ్యక్షుడు షేక్ లాల్‌మహ్మద్, సహాయ కార్యదర్శి గోగు అప్పారావు, ఇతర సభ్యులు నిరసనలో పాల్గొన్నారు. సోమవారం నుంచి యథావిధి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పాల్గొంటామని తెలిపారు.

ఆటలతో మంచి ఆరోగ్యం

సామర్లకోట: ఆటలతో మంచి ఆరోగాన్ని కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛతాహీ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం రైల్వే ఉద్యోగులు, కార్మికులకు ఆయన ఆట పోటీలు నిర్వహించారు. షటిల్ బ్యాట్మింటన్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేస్తే స్వచ్ఛ రైల్వే స్టేషన్ నిర్మాణానికి అవకాశం ఉంటుందన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ప్లాంటు ఫారంపై ప్రయాణికులకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. ప్లాట్‌ఫాం, స్టేషన్ ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, కాగితాలను తొలగించారు. ఈ మేరకు ప్రయాణికులు, రైల్వే ఉద్యోగులతో కలిసి స్టేషన్ రైల్వేస్టేషన్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు గిరి, టీటీఐ చైతన్య, పార్శిల్ సూపర్‌వైజర్ మోసీద్దీన్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీఓటీల శిక్షణ

సామర్లకోట: పేదరికం నిర్మూలనకు గ్రామస్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ ఫ్యాకల్టీలు డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ శర్మ, కె.సునీల, కేఆర్ నిహారిక అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న ఉత్సాహవంతులైన పంచాయతీ కార్యదర్శులను టీఓటీలుగా ఎంపిక చేసి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజుల పాటు శిక్షణనిచ్చారు. ఈ శిక్షణలో శనివారంతో ముగిసింది. గ్రామాల్లో ఆకలి బాధలను నిర్మూలించడం, ఆరోగ్య సంరక్షణ–జీవన ప్రమాణాలు పెంపు, అందరికీ తాగునీటి వసతి కల్పించడం–పరిసరాల పరిశుభ్రంగా ఉంచడం, ఉపాధి–ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాలకు కావసిన నిధులను కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు అందజేస్తుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు విన్నకోట సురేష్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. జయలక్ష్మీ థియేటర్ రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 98664 11346 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

జై భవానీ

- రేపటి నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు
- దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం
- పాదగయ క్షేత్రంలో భారీ ఏర్పాట్లు
- సర్వాంగ సందరంగా తయారైన ఆలయాలు



ఉత్సవాలకు సిద్ధమైన పాదగయ క్షేత్రంలోని పురుహూతిక అమ్మవారు



ఉత్సవాలకు సిద్ధమైన పాదగయ క్షేత్రం

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలకు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సర్వసిద్ధం చేశారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయగా పిఠాపురం నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాలు సర్వాంగ సందరంగా తయారయ్యాయి. ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు వేడుకలు జరగనున్నాయి. ఈ ఏడాది 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనుండగా అమ్మవారు కాత్యాయనిదేవిగా ప్రత్యేక అవతారంలో దర్శనమివ్వనున్నారు. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉన్న అష్టాదశ శక్తి పీఠాలలో 10వ శక్తి పీఠం అయిన పురుహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరిదేవిని, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణాదేవి అమ్మవార్ల ఆలయాలను ఉత్సవాలకు సిద్ధం చేశారు.



పాదగయ క్షేత్రంలో భవానీ దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

ప్రత్యేక ఏర్పాట్లు

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రతిరోజు నిర్వహించే పూజలకు భక్తులందరూ పాల్గొనేలా ఏర్పాటు చేశారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. నియోజకవర్గంలో ప్రముఖ కనకదుర్గ అలయాలతోపాటు వివిధ గ్రామాలలో దుర్గాదేవిని ప్రత్యేక మండపాలలో నిలిపి ఉత్సవాలు నిర్వహించడానికి స్థానికులు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాట్లతో కళకళలాడుతున్నాయి.

ఎరుపెక్కిన గ్రామాలు

శరన్నవరాత్ర ఉత్సవాలు దగ్గర పడుతున్నాయంటే గ్రామాలు జై భవానీ నామస్మరణలు మార్మోగుతుంటాయి. దసరాకు నెల రోజుల ముందు నుంచి భవానీ భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరించి దసరాకు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని దీక్షలు విరమిస్తుంటారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో పదో శక్తిపీఠమైన పురూహూతికా అమ్మవారి సన్నిధిలో గత వారం రోజుల నుంచి భవానీ మాలధారణ ప్రారంభించారు. 20 వేలకు పైగా భక్తులు భవానీ దీక్షలు స్వీకరించారు. భవానీ దీక్షాధారణల సందర్భంగా భారీగా భక్తులు తరలి రావడంతో శనివారం పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ప్రతిరోజు శ్రీరాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వారం రోజుల నుంచి పాదగయ క్షేత్రంతో పాటు ఇతర దేవాలయాలలోను ప్రతి రోజు వందల మంది భవానీ దీక్షా మాలలు దరిస్తున్నారు.

గ్రామాల్లో మహిళలకు వైద్య పరీక్షలు



నాగులపల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొత్తపల్లి: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ తగిన శ్రద్ధ ఉండాలని కొత్తపల్లి, నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సుష్మ, సౌజన్య అన్నారు. మండలంలోని యండపల్లి సచివాలయం–1, నాగులపల్లి సచివాలయం–2లో శనివారం స్వస్థ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ 10 – 19 సంవత్సరాల కౌమార బాలికలు, 20ఏళ్లు దాటిన మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యంపై అవగాహన ఉండాలన్నారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ అసుపత్రి వైద్యులు, నాగులపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, నారాయణ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- ఆర్డీఓ కార్యాలయం వద్ద వీఆర్ఏల ధర్నా
- సీఐటీయూ నాయకులు రాజ్‌కుమార్, క్రాంతికుమార్ మద్దతు



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న రాజ్‌కుమార్

పెద్దాపురం: గ్రామ రెవెన్యూ సహాయ అధికారులు (వీఆర్ఏ)ల సమస్యలను కూటమి ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని లేనికుంటే ఆందోళన చేపడతామని వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు నిడమర్తి సురేష్, గెడ్డం బాబూజీ హెచ్చరించారు. రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద పెద్దాపురం వీఆర్ఏ సంఘం నాయకులు దువ్వాపు వీరబాబు, సుందరపల్లి రామలింగేశ్వరారావు, చింతపల్లి సాయిభువన్, నూకతట్టు వెంకటరమణల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు చెక్కా రాజ్‌కుమార్, డి.క్రాంతికుమార్ మద్దతు పలికి వారినుద్దేశించి ప్రసంగించారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. నామినీ వీఆర్ఎలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొమరగిరి కృష్ణ, గంపల వీరబాబు, గొర్ల సత్యవేణి, షేక్ బీబీ, ఆయా మండలాలకు చెందిన ఆయా గ్రామాల వీఆర్ఎలు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

- చెరువులుగా మారిన రోడ్లు
- పొంగి ప్రవహించిన డ్రైన్లు
- పూడిక తీత పనులు చేసినా ఫలితం శూన్యం



సామర్లకోట మఠం సెంటర్ నుంచి అయోధ్యరామపురం వెళ్లే వెలంపేట రోడ్డు



సామర్లకోట రైల్వే స్టేషన్–బస్సు కాంప్లెక్స్ కూడలి వద్ద చెరువుగా మారిన జయలక్ష్మి థియేటర్ రోడ్డు

సామర్లకోట: పట్టణంలో శనివారం సాయంత్రం సుమారు అరగంట పాటు కుండపోత వర్షం కురిసింది. వర్షపు నీటికి రోడ్లు చెరువుల్లా మారాయి. డ్రైన్లు పొంగి ప్రవహించడంతో డ్రైన్లలో నీరు రోడ్ల పైకి చేరింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల ప్రధాన డ్రైన్లలో సుమారు రూ.30 లక్షలతో వ్యయంతో పూడికతీత పనులు జరిగాయి. అయినా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడం, డ్రైన్లలో నీరు ప్రవహించకపోవడంతో పూడిక తీత పనులు వలన ప్రయోజనం శూన్యమేనని విమర్శలు వినిపించాయి. డ్రైన్లు ఆక్రమణలకు గురవడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక రోడ్లు చెరువులుగా మారాయి. స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథం సెంటర్, షిర్డిసాయిబాబా రోడ్డు, వెలమపేట, సంగీతరావుపేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లలో నీరు నిలిచిపోయింది. స్టేషన్ సెంటర్‌లో రోడ్లపై నీరు ఉధృత్తంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ప్రెసిడెంట్ గారి రోడ్డులో డ్రైనులో నీరు రోడ్డుపై ప్రవహించింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైనులో నీటి ప్రవాహానికి సత్యనారాయణపురం రోడ్డు చెరువుగా మారింది. ఆ రోడ్డులో అడుగడుగునా గోతులు ఉండడంతో వాహనచోదకులు తమ తమ వాహనాలను నడిపించుకుని వెళ్లారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి డ్రైనుల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులోనికి చేరింది. అయితే ఆ డ్రైను నిండిపోవడంతో జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. బస్సు కాంప్లెక్స్‌లోనికి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లోని రోడ్డుపై నీరు నిలిచిపోవడం వలన వాహనాల రాకపోకలతో ప్రయాణికులపై రోడ్లపై వెదల జల్లడంతో వారి దుస్తులు పాడైపోయాయి.

వంగా గీత పరామర్శ



వాకతిప్పలో సత్యవతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గీత

కొత్తపల్లి: గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబాలను శనివారం పిఠాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వాకతిప్పకు చెందిన ఎద్దు సత్యవతి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడకు చెందిన దోని కాశమ్మ వారి కుటుంబ సభ్యులను, శ్రీరాంపురం గ్రామానికి చెందిన కొయ్య ముసలయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సబ్యులను పరామర్శించి ఆమె సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆర్థిక సహాయం అందజేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షుడు గోపి హిరిబాబు, సర్పంచ్ పాలని దొరబాబు, మేక నాని, పెంకే రాంబాబు, ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ, బొందు రాంబాబు, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి జ్యోతుల బాబులు, కడారి సతీష్, యాదాల నాగేంద్ర, గోరిసే సతీష్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం



మోడల్ స్కూల్ హెచ్ఎంను సత్కరించిన ఉపాధ్యాయులు

సామర్లకోట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వేట్లపాలెం త్రి మోడల్ స్కూల్ హెచ్ఎం ఎం.రేచల్ కుమారిని శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం పి.అనురాధ అధ్యక్షతన సన్మానం జరిగింది. రేచల్‌కుమారి గత 36 ఏళ్లుగా ఉపాధ్యాయినిగా పని చేస్తూ అనేక అవార్డులు పొందారని, ఆమె ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ మేరకు వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు కె.బల రామ్మూర్తి, పి.బంగ్రారాజు, పి.సుబ్బారావు, ఎస్.సత్యనారాయణ, ఏఎంవీఆర్ చౌదరి, కాంప్లెక్స్ సీఆర్పీ అందుగుల వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా పయనిద్దాం



ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: రాష్ట్రం స్వచ్ఛాంధ్రా లక్ష్యంగా పయనించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేసి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీఓ అన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు, ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సామర్లకోట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతంగా జీవించడానికి అవకాశం ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆయా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. మురికి గుంటలు ఉండడం వలన అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేజీ భవానీ, ఎస్.హరినాథ్, పి.నిర్మల, సీహెచ్ లక్ష్మీదుర్గ, పి.బ్రహ్మానందం, పీఈటీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛ సంకల్పం

సామర్లకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక బీబీ ఆర్ హైస్కూల్ వద్ద మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆ ప్రాంత ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి , మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్, సరోజ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

హెడ్ పోస్టాఫీసు ఆధ్వర్యంలో ర్యాలీ

సామర్లకోట: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా స్థానిక హెడ్ పోస్టాఫీసు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హెడ్ పోస్టు మాస్టరు టి.అమ్మిరాజు ప్రారంభించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నినాదాలు చేశారు. ఈ మేరకు హెడ్ పోస్టాఫీసు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

తాళ్లరేవు: సమాజంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. వరల్డ్ ఫోరెన్సిక్ సైన్స్ డే సందర్భంగా జిల్లా ఎస్పీ బింధుమాధవ్ ఆదేశాల మేరకు శనివారం పటవల పైడా ఇంజినీరింగ్ కళాశాలలో ఫోరెన్సిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ప్రథమ కర్తవ్యంగా పోలీసులు పనిచేస్తున్నారని, తదనుగుణంగా ప్రజలు సహకరించాలని కోరారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే తక్షణం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పైడా కళాశాల కరస్పాండెంట్ పైడా సత్య శ్రీరామ్, డీన్ ఎం.వీరభద్రరావు, ప్రిన్సిపాల్ పీవీ సూర్యప్రకాష్, ప్రొఫెసర్ రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ వర్షిణీ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో కోస్టల్ క్లీన్ ఆఫ్ వీక్



తీరప్రాంతంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేట, పొన్నాడ తీర ప్రాంత గ్రామాల్లో శనివారం కోస్టల్ క్లీన్ ఆఫ్ వీక్‌లో భాగంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సంయుక్తంగా సముద్ర జలాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మూలపేటలో బీచ్‌ను శుభ్రపరచారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సముద్ర జలాల పరిశుభ్రతలో భాగంగా భారతదేశంలో 245 బీచ్‌లలో మన రాష్ట్రంలో 14 బీచులు గుర్తించామన్నారు. కాకినాడ జిల్లాలో ఉప్పాడ బీచ్ గుర్తించామన్నారు. బీచ్ పరిశుభ్రతపై పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఎస్ బేగం, మూలపేట జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తం



వరి సాగులో డ్రోన్ వినియోగంపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

సామర్లకోట: సార్వా వరి పంట పిలక, చిరు పొట్ట దశలో ఉన్న సమయంలో దోమ, ఎండాకు, పొడ తెగులు ఉధృతిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, సమగ్ర సస్య రక్షణ పద్ధతులు చేపట్టాలని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు ఎం.రామభద్రరాజు అన్నారు. శనివారం పరిశోధన కేంద్రంలో నెల రోజుల్లో పంటలకు చేపట్టాల్సిన వ్యవసాయ కార్యక్రమాలను వ్యవసాయశాఖ అధికారులు, రైతులకు ఆయన వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు బాక్టీరియా ఎండాకు తెగులు ఆశించిందని తెలిపారు. దీని నివారణకు నత్రజని ఎరువులు నిలిపి వేసి, మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ఎకరాకు 20 కిలోలు పిచికారీ చేయాలన్నారు. ఉధృతి తగ్గడానికి ప్లాంటోమైసిన్ 1.0 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మార్టేర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టరు ఆనంద్, అప్పారావు డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఎరువులు, పురుగు మందుల పిచికారీతో పాటు, విత్తనాలు చల్లుకునే విధానంపై శిక్షణ నిర్వహించారు. ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఉద్యానవన పంటలపై డాక్టరు సునీత వివరించారు. ఈ కార్యక్రమం వ్యవసాయాధికారులు ఎస్.జయరామలక్ష్మి, కాకాడ బాబూరావు, శ్రీనివాసరెడ్డి, సీహెచ్ శ్రీనివాసు, బుల్లిబాబు, రాజశేఖర్, నాగకుమార్, గౌతమ్, దైవకుమార్, వట్టి జోగిరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



మేడపై నుంచి దూకేందుకు ప్రయత్నిస్తున్న బాధితుడు

పిఠాపురం: కొందరు ఆటో యూనియన్ నాయకులు తనతోపాటు తన కుటుంబాన్ని వేధిస్తూ, తమను రోడ్డున పడేశారని, తనకు న్యాయం చేయకపోతే చావే దిక్కంటూ పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం వద్ద శనివారం ఒక ఆటోడ్రైవర్ పెట్రోల్ పోసుకుని, మేడపై నుంచి దూకేస్తానని హల్‌చల్ చేశాడు. చివరకు పోలీసులు, స్థానికులు వచ్చి హామీ ఇవ్వడంతో ఆ ఆటో డ్రైవర్ తన ఆత్మహత్యాయత్నం విరమించాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం వద్ద ఒక ఆటో యూనియన్ సభ్యులుగా ఉన్న గుండు దుర్గాప్రసాద్, అతని తండ్రి ఏడుకొండలును ఏడాదిన్నర క్రితం యూనియన్ నాయకులు కొందరు తొలగించారు. తమను దుర్మార్గంగా తొలగించడమే కాకుండా తరచూ అనేక రకాలుగా వేధిస్తున్నారని, తాము వేరే ఊరు వెళ్లిపోయినా సరే వేధింపులుఆపలేదని, దీనివల్ల జీవనోపాధి కోల్పోయామని ఆటోడ్రైవర్ గుండు దుర్గాప్రసాద్ వాపోయాడు. పోలీసులు, రాజకీయ నాయకుల వద్దకు వెళలఇ చెప్పుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆటోడ్రైవర్ కుటుంబ సభ్యులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి వారి ఆందోళన విరమించాలని కోరారు. ఇంతలో ఆటోడ్రైవర్ గుండు దుర్గాప్రసాద్ అక్కడ ఉన్న మూడంతస్తుల మేడ ఎక్కి దూకేసేందుకు ప్రయత్నిస్తూండగా పోలీసులు వారించి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆ యత్నాన్ని విరమించాడు. దీంతో ఆ కుటుంబ సభ్యులను పోలీసు స్టేషనుకు తరలించారు.